క్లుప్తంగా

పీఏసీఎస్ డైరెక్టర్ రాజీనామా

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ గుండారపు తిరుపతి పదవితో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు బుధవారం తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తారని అన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం, ఐలాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారికి ఏటూరునాగారంలో కండువ కప్పి మంత్రి సీతక్క ఆహ్వానించారు. సునార్కని రమేశ్, గాందెర్ల అంజయ్య, కావిరి నర్సింహారావు, మల్లయ్య, కొమరయ్య, మల్లేశ్, జనార్దన్, ముత్యారావు, సమ్మయ్య, చొక్కారావు తదితరులు ఉన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడ సమీపంలో దసరా ఉత్సవాల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. నేడు(గురువారం) సాయంత్రం 6 గంటల నుంచి రామాలయంలో పూజా కార్యక్రమాల అనంతరం ర్యాలీ ప్రారంభం అవుతుందని దసరా ఉత్సవాల కమిటీ అధ్యక్షుడ ఇర్సవడ్ల వెంకన్న తెలిపారు. శమిచెట్టుకు పూజలు చేసిన అనంతరం రావణాసురవధ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ: కొత్తపల్లిగోరి మండలం నిజాంపల్లి గ్రామానికి చెందిన భూపాలపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మకంటి రవి తల్లి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, నాయకులు ఓంప్రకాశ్, మధుకర్, రాజు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ గేట్ ఎదుట బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా పంచాయతీ అధికారి కారు బయటకు వస్తున్న క్రమంలో పాల్‌సాబ్‌పల్లి నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకులను గమనించకుండా కారును ఢీకొట్టారు. దీంతో కారు అద్దం పగిలి యువకుడి చేతికి గాయమైంది. మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు..

- యువకుడి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- మేడిపల్లి శివారులో ఘటన



కారులో ఇరుక్కుపోయిన శ్రీనివాస్

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మేడిపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి ట్రాక్టర్‌ను కారు ఢీకొంది. ఈ ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కాటారం మండలం కొత్తపల్లికి చెందిన తైనేని శ్రీనివాస్(30), పోటు రాకేశ్ కారులో భూపాలపల్లి వెళ్లి తిరిగి కొత్తపల్లి వస్తున్నారు. ఈ క్రమంలో మేడిపల్లి అటవీ ప్రాంతంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో శ్రీనివాస్, రాకేశ్ ఇరుక్కుపోయి తీవ్రగాయాపాలవగా శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాకేశ్‌ను చికిత్స నిమిత్తం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. శ్రీనివాస్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

అందని వేతనాలు

- ఆర్థిక ఇబ్బందుల్లో గోపాలమిత్రలు
- పెండింగ్‌లో ఆరు నెలల జీతం



పశువుకు వైద్యం అందిస్తున్న గోపాలమిత్ర(ఫైల్)

మొగుళ్లపల్లి: పల్లెల్లోని మూగజీవాలకు వైద్య అందించే గోపాలమిత్రలకు ఆరు నెలలుగా వేతనాలందక ఆర్థిక ఇబ్బందులకు పడుతున్నారు. కుటుంబపోషణ కష్టంగా మారిందని కనీసం దసరా పండగ ముందైనా వేతనాలకు నిధులు విడుదల కాకపోవడంతో పండగ పూట పస్తులుండాల్సిందేనా.. అని గోపాల మిత్రలు వాపోతున్నారు. జిల్లాలో 25 మంది గోపాలమిత్రలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేసే అన్ని కార్యక్రమాల్లో సేవలందిస్తున్నారు. మూగ జీవాలకు సోకే వ్యాధుల నియంత్రణతో పాటు గాలికుంటు, నట్టల నివారణ టీకాలను వేయడంలో వీరిల పాత్ర కీలకం, పశుసంతతిని వృద్ధి చేసేందుకు పశువుకు కృత్రిమగర్భాధారణ చేసే విధుల్లో నూ గోపాల మిత్రలదే ప్రధాన పాత్ర.

వైఎస్సార్ వచ్చాకే గౌరవవేతనం...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పశువైద్య సేవల్లో స్వచ్ఛందంగా భాగస్వాములయ్యేలా అప్పటి పాలకులు అవకాశం కల్పించగా, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే 2006లో గోపాలమిత్రలకు రూ.1.200 గౌరవవేతనం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్ మరణానంతరం సీఎంగా వ్యవహరించిన రోశయ్య రూ.3.500కు పెంచగా తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8,500కు పెంచారు. ప్రస్తుతం పీఆర్సీతో కలిపి రూ.11,050 వేతనం పొందుతున్నారు. కాగా వేతనాలు ఆరు నెలలుగా రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పశువులకు కృత్రిమ గర్భాదారణ చేసేందుకు కేంద్రం అందించే రూ.100 ప్రోత్సాహకం కూడా చాలా ఏళ్లుగా రావడంలేదు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనం చెల్లించాలని గోపాలమిత్రలు కోరుతున్నారు.

కుటుంబ పోషణ కష్టమే..



పాతికేళ్లుగా పశువులకు సేవలందిస్తున్న తమకు అందించే వేతనమే తక్కువ.అయినా ఆ వేతనాలను రెగ్యులర్ అందించడం లేదు.దీంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి వేతనాలు సకాలంలో ఇచ్చేలా చూడాలి...

- శ్రీనివాస్, గోపాలమిత్ర జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వానికి నివేదించాం..

గోపాలమిత్రలుగా పనిచేస్తున్న వారికి ఈ ఏడాది మార్చి వరకు వేతనాలు చెల్లించాం. ఏప్రిల్ నుంచి బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు అందగానే చెల్లిస్తాం.

- సంపత్‌రావు, ఈఓ, పశుగణాభివృద్ధి సంస్థ

‘పుట్ట మధుపై చర్య తీసుకోవాలి’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం: పోలీసుల డ్రెస్ కోడ్‌ను అవమానపరుస్తూ వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై చట్టపరంగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ తెలిపారు. కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను ఏ సమయంలో అయిన అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు ఉందన్నారు. పుట్ట మధు పోలీసులపై అసత్య అర్థరహిత ఆరోపణలు చేస్తూ పోలీస్ వ్యవస్థను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. పుట్ట మధు నేరస్తులకు మద్దతుగా నిలిచి శాంతియుతంగా ఉన్న మంథని ప్రాంతంలో అశాంతిని కల్గజేస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్‌డ్రెస్ కోడ్‌ను సఫాయి కార్మికులు, ఆటో డ్రైవర్లతో పోల్చడం ప్రజాస్వామ్యాన్ని, పోలీస్ వ్యవస్థను కించపర్చడమే అని అన్నారు. స్థానిక ఎన్నికల వేళ పుట్ట మధు ఈ ప్రాంతంలో అశాంతిని ప్రేరేపించేలా వ్యవహరిస్తున్నారని దీనిపై ఎన్నికల సంఘం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ఎస్సై దివ్య



మొగుళ్లపల్లి: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రేగొండ: రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కొత్తపల్లిగోరి ఎస్సై సాకపురం దివ్య సూచించారు. బుధవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఉద్యోగాలు ఇప్పిస్తామని, లోన్ ఇప్పిస్తామని ఫోన్ చేసి సంప్రదిస్తే వాటిని నమ్మవద్దని సూచించారు. అపరిచితులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం, ఆధార్, పాన్‌కార్డు ఇతర వివరాలు తెలపొద్దని అన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే ఏపీకే లింక్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి: మోసపూరిత ఆన్‌లైన్ పెట్టుబడి ప్రకటనలు నమ్మి మోసపోవద్దని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని వేములపల్లి గ్రామంలో హెడ్ కానిస్టేబుల్ సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరస్తులు ఫేక్ పోలీస్ ఆఫీసర్ అని చెప్పుకొని అమాయకులకు కాల్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అసలు డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదన్నారు. ఎవరికైనా ఇలా సైబర్ నేరస్తులు కాల్ చేస్తే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి రిపోర్ట్ చేయమన్నారు. ఇందిరమ్మ ఇల్లు వచ్చిందంటూ వచ్చే అపరిచిత కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ములుగు రూరల్: శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు



గోవిందరావుపేట: విద్యార్థులతో ట్రైనర్ సౌజన్య

ములుగు రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ సాంబారి రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బండారుపల్లి మోడల్ స్కూల్‌లో దసర సెలవుల్లో విద్యార్థులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పని అనుభవం, ప్రత్యక్ష అవగాహన కోసం ఈ శిక్షణ తరగతులను నిర్వహించిటన్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, మిధున్ రాజు, ప్రిన్సిపాల్ దేవకి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు శిక్షణ

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సులో భాగంగా పది రోజుల పాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా రమా బ్యూటీ పార్లర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోవిందరావుపేటలో విద్యార్థులకు క్షేత్రస్థాయిలో శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వొకేషనల్ కో ఆర్డినేటర్ అనిల్, సాంబశివరావు, సమగ్ర శిక్ష అభియాన్ కో ఆర్డినేటర్ రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ జి కుమార్, వొకేషనల్ ట్రైనర్ సౌజన్య, పావని, పార్లర్ నిర్వహకురాలు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల దాతలు..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో పదకొండు రోజులకుగాను వివిధ అలంకరణలు, అన్నదానం, చీరలు అందజేసి దాతల వివరాలను ఆలయ అధికారులు బుధవారం ప్రకటించారు. రిక్కల మహేందర్‌రెడ్డి పావని, గర్లపాటి జగదీష్ భవాని, గండెసిరి మధుసూదన్ రమాదేవి, పెండ్యాల కృష్ణజయంతి, పవన్ కుమార్ స్రవంతి, దావరశెట్టి నర్సింహులు వసుధ, సనకంటి బలరామ్‌శర్మసుజాత, పనకంటి శ్రీకాంత్ రంజన, దేవయ్యభూలక్ష్మీ, భాగవతుల శాంతన్‌కుమార్ ఆనందమాధవి, మాడుగుల చంద్రమోహన్ లక్ష్మీభవాని, రామగుండం మహేష్‌శర్మ సరోజన, జలా శంకర్‌రెడ్డి విజయ, పి.నారాయణరావుశోభ, భరతానంద్ సునీత, సూర్యప్రకాశ్ ఉషశ్రీ, పసునూరి ప్రసాద్‌సంధ్యారాణిలు అందజేసినట్లు ఈఓ మహేష్ తెలిపారు. వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

‘ఇందిరమ్మ లబ్ధిదారులు పైసా కూడా ఇవ్వొద్దు’

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని ఇందిరమ్మ లబ్ధిదారులు రాజకీయ పార్టీ నాయకులకుగానీ అధికారులకు ఒక పైసా కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేదల కళసాకారం చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంలో అధికారులు, నాయకులకు డబ్బులు ఇవ్వొద్దన్నారు. ఎవరైన డబ్బులు అడిగితే వెంటనే పార్టీ నాయకత్వాన్ని ఫిర్యాదు చేయాలన్నారు. పార్టీని బద్నాం చేసేందుకు కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని సరైంది కాదన్నారు.

ఆలయాల అభివృద్ధి కమిటీ ఏర్పాటు



ఎన్నికైన కమిటీ సభ్యులు

చిట్యాల: మండల కేంద్రంలోని చింతలపల్లి గ్రామంలోని ఆలయాల అభివృద్ధి కమిటీని గ్రామస్తుల సమక్షంలో బుధవారం ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఆట స్థల ప్రాంగణంలో అన్ని కుల సంఘాలు యువజన సంఘాలు పుర ప్రముఖులు సమావేశమై కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శృంగారపు రంగాచారి, ప్రధాన కార్యదర్శిగా అల్లం తిరుపతి, కోశాధికారిగా సామల రమేష్, ఉపాధ్యక్షులుగా పిట్టల రమేష్, గుర్రపు రాజు, ఓర్సు భద్రయ్య, ప్రచార కార్యదర్శిగా మూసాపూరి రవీందర్ కార్యదర్శులుగా చేర్ల చందు తూముల సంజీవ్, గుండా సురేష్, చిలగాని నాగరాజ్ తదితర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ గ్రామంలో ఉన్న ఆలయాల అభివృద్ధి కోసం పని చేస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రంగాచారి మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ఆలయాల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని గ్రామస్తుల సహకారంతో ఆలయాలను ఉన్నతిలో అభివృద్ధి పరిచే విధంగా నడుచుకుంటానని తెలిపారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు బలరాం



మాట్లాడుతున్న బలరాం

ములుగు రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరామ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని అన్నారు. నాయకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, భూక్య రాజు రమేశ్, సురేందర్, కృష్ణకర్, రాజ్ కుమార్, రవి రెడ్డి భిక్షపతి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొగుళ్లపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పదోరోజు అమ్మవారు మహిశాసురమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని శివాలయం దగ్గర కొలువుదీరిన దుర్గామాతకు మోటె రాజేశ్వర్‌రావు, శ్రీధర్ కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భజనమండలి సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బురదరోడ్డుపై నడిచేదెలా?



బురదరోడ్డులో ఇబ్బందులు పడుతూ వస్తున్న మహిళలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో వర్షాలకు రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో రోడ్లపై నడిచేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా రోడ్డుపై మురుగు పారడంతో దుర్గంధం వస్తుందని స్థానికులు వాపోతున్నారు. రోడ్లను మరమ్మతు చేయించాలని, మురుగు తొలగించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతులు చేసేవిధంగా చర్యలు తీసుకోవాని కోరుతున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



బాకీకార్డులను చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో లక్ష్మీనరసింహారావు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియాను అందించడంలో, పెన్షన్లు, రైతు భరోసా ఇలా అనేక పథకాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ వైఫల్యాన్ని ఎండగడుతూ ప్రజలకు ఇంకా బాకీ ఉన్న హామీలను ఒక కార్డు రూపంలో తీసుకొచ్చారన్నారు. ప్రతి కార్యకర్త కాంగ్రెస్ వైఫల్యాన్ని ఎండగడుతూ ప్రజలకు బాకీ ఉన్న ఈ పథకాల కార్డును ప్రతి ఇంటికి చేరవేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సునీల్ కుమార్ జిల్లా నాయకులు తాడూరి రఘు, తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణ, చిన్ని కృష్ణ, ఖాజాపాషా, చిన్ని, జంపన్న, మోహన్ రావు, చంద్రబాబు పాల్గొన్నారు.

వైన్స్, మాంసం దుకాణాలు మూసేయాలి



గోవిందరావుపేట: గాంధీ జయంతి సందర్భంగా నేడు(గురువారం) పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని రకాల వైన్స్ షాపులు, బెల్ట్ షాపులు, మాంసం సెంటర్లు మూసేయాలని ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. బుధవారం పస్రా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో స్పెషల్ రైడ్స్ నిర్వహిస్తామని ఎవరైనా పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అందరూ ప్రశాంతంగా గాంధీ జయంతి, దసరా పండుగ నిర్వహించుకోవాలని అన్నారు.

కొనసాగుతున్న దినసరి కార్మికుల నిరసన

ఏటూరునాగారం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న దినసరి కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి 20వ రోజు చేరింది. దీంతో దినసరి కార్మికులు అందరూ ఖాళీ ప్లేట్లతో ఐటీడీఏ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు ఎండీ దావూద్, రత్నం రాజేందర్లు మాట్లాడుతూ.. వర్కర్లు 20 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్య పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని అన్నారు. ఎనిమిది నెలల నుంచి జీతాలు లేక కుటుంబం గడవలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతూ ఉంటే మరోపక్క వేతనాలను తగ్గిస్తూ జీఓ నంబర్ 64ను తీసుకురావడం ప్రభుత్వ దుర్మార్గపు చర్యకు నిదర్శనం అన్నారు. దసరా పండుగలో కుటుంబం ఆనందంగా ఉండాల్సినటువంటి సందర్భంలో బాధతో పండగ చేయలేని పరిస్థితిలో రోడ్డుపైన కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిటమట రమేశ్, వర్కర్ల నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, సమ్మక్క, విజయ లక్ష్మీ, రాజు, నందం, సమ్మయ్య, సూర్యతేజ, ఇందిరా ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



వినయ్ (ఫైల్)

కాటారం: మండలంలోని కొత్తపల్లి శివారులోని రైస్ మిల్లు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కాటారం మండల కేంద్రానికి చెందిన పంతకాని వినయ్(27), గొని నితీశ్ బైక్‌పై మండలంలోని అంకుషాపూర్‌కు వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయారు. దీంతో వినయ్, నితీశ్ తీవ్రగాయాలపాలవగా స్థానికులు చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. వినయ్ తలకు తీవ్రగాయం కావడంతో భూపాలపల్లి ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించారు. వినయ్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.